# గొడుగు

మూలనున్న గొడుగందుకొని గుమ్మం లోకి వచ్చి నిలబడ్డాడు రవణయ్య. సూర్యుడు ఇంద్రధనుస్సు నెక్కుపెట్టి ఒకేసారిగా వారుణాస్త్రం, ఆగ్నేయాస్త్రం వేసినట్టుగా ఓపక్క చినుకులు పడుతూండగా, మరోపక్క వేడిగా, వాడిగా కిరణాలు గుచ్చుకుంటున్నాయి. చినుకులు పెద్దవిపడినా, అసలు పడక పోయినా, ఎండగావున్నా, లేకపోయినా ఆ గొడుగు నెత్తిమీదో, చంకలోనో లేకుంటే రవణయ్య రోడ్డుమీద నడవడు. ఎండ కెండి వానకి తడవడంవల్ల కాబోలు నల్లని గొడుగుగుడ్డరంగు విరిగి బూడిద రంగులోనికి మారింది.

బయల్దేరినపని ఆఖరయిన సిగరెట్టులా చురుక్కుమనిపించగానే గొడుగు విప్పి అడుగేసేడు... "ఒసేవ్ అమ్మడూ తలుపేసుకో" అని కేకేస్తూ.

మీదనుండి సన్నని తుంపర చల్ల చల్లగా పడుతూంటే తలెత్తి చూసేడు రవణయ్య. నల్లని మబ్బుల్తో కమ్మేసిన ఆకాశంలో తన నెత్తిమీదున్న మేరకు మాత్రం మిలమిలా మెరుస్తున్న చుక్కల్లా పురుగులు కొట్టేసిన కన్నాలు కనిపిం చేయి. 'పట్టపగలు చుక్కల్దూరుతయి నా గొడుగులో...' అనుకుని నవ్వుకో బోయిన నవ్వుకి, 'నువ్వేం తక్కు వ్వాడివా నీగొడుగేం తక్కువ తిన్నదా?' 'రమణా బియ్యే' గాడి గొంతులోపలి నుండి పలికి నవ్వు ఉండకట్టేసింది.

రమణా బియ్యేగాణ్ణి తనే చంపేసేడు. లేపోతే ఇలానే మాటిమాటికీ బతుకు దారికడ్డంవొచ్చి అల్లరి పెడుతుంటాడు. ఎన్నిసార్లు చంపేసినా అడుగడుక్కీ బతికొచ్చేసి కామెంటుచేస్తూనే ఉంటాడు, బియ్యే వెనక్కాల తగిలించుకుని కాణీ సంపాదనలేదుగానీ హాయిగా కాలక్షేపం చేస్తున్నవాణ్ణి నిజాయితీ అంటూ దారి తప్పించడానికి ప్రయత్నిస్తుంటాడు.

"నాగేశ్వర్రావుగారూ..." అంటూ పైనుండి పిలిచేడు రవణయ్య.

"ఏవిట్రా నాగేశ్వర్రావుగారూ. ఇదె

---

కొడవంటి కాశీపతిరావు

---

ప్పటినుండీ . రారా," అంటూ చాప పరచి కూర్చోమన్నట్టుగా చాపమీద కొట్టేడు నాగేశ్వర్రావు.

" శ్రీరామా ... ఆపద్బాంధవా, అనాథరక్షకా" అంటూ కూలబడి ... "ఆయ్యా కాలం మారింది. తాహతులు మారేయి, అన్నట్టు కాలం మారింది సినీమా చూసేరేవిటీ...నేను సినిమాచూసి రెండేళ్ళ యుండది."

"ఓరి నీ సిగతరగా ఈ వయసులో ఇంకా సినిమా కబుర్లేవిట్రా! రామాకృష్ణా అని ఏ రామ్మజిరం కబుర్లో, పోల్టిక్స్ కబుర్లో చెప్పకోక..." అని నవ్వేడు నాగేశ్వర్రావు

"ఆఁ ఆఁ నవ్వుతావు బాబూ ... ఏ కబుర్లయినా కడుపునిండిన వాళ్ళకే ...మాలాటి వాళ్ళకేవిటి ... మిమ్మల్ని సంతోషంపెట్టి మా కడుపుల నింపుకోటానికి చూస్తాం ... లేకపోతే రెక్కాడిద్దామన్నా డొక్కాడనివ్వదు."

"ఎన్నిసార్లు ఏడుస్తావురా...నిజవే బియ్యే అయినప్పనుండీ ఉద్యోగంలేదు. పదిహేనిరవై యేళ్ళుగా ప్రైవేట్ల మీదనే బతుకుతున్నావు. నీకన్నా లేనివాడి గురించి నువ్వెప్పుడైనా ఆలోచించావా?" అన్నాడు నాగేశ్వర్రావు.


"సరే...నా గురించి ఆలోచించటానికే భయంగావుంది. ఇంట్లో అన్నీ నిండుకున్నాయి పైగా ఇంట్లో చిన్న కార్యం. ప్రైవేటు జీతం ఇప్పిస్తావని వచ్చేను"

"రవణయ్యా, జీతవడిగేవని కాదు గానీ మావాడు మరీ పనికిరానివాడై పోతున్నాడ్రా...ఒక్క అక్షరమ్ముక్క రాదు. ఆ బళ్లో ఏం చెప్తున్నారో...పైగా నీదగ్గర ప్రైవేటు కూడాను."

"మీరన్నారనికాదుగాని నాగేశ్వర్రావుగారూ...జీతవడిగేవరకూ పిల్లల బాగోగులు గుర్తుకురాని దీనస్థితిలో ఉన్నావండీ మనం. ఆ బాగోగులుకూడా డబ్బుతో లంకెపెడుతున్నాం"

"ఏంరోయ్...ఏదో తిడుతున్నట్టున్నావ్...నిన్నన్లేదు! ఆ బళ్ళో మేస్టర్లనంటున్నా..."

"అవును, నేనూ అదే అంటున్నా. విద్యావిధానంలోని లోపాలన్నిటికీ ఉపాధ్యాయుడికే నిందలూ, తిట్లూ... అతడు ప్రత్యక్షదైవం కాబట్టి! అది పడటానికికూడా అతని కార్థికంగానూ సాంఘికంగానూ ఒక స్థాయంటూ లేదు కాబట్టి. అయితే ఆ స్థితికి దిగజార్చింది మనం. ఉద్యోగాల్లేక ఎక్కడ బడితే అక్కడ గోనెపట్టాలేసుకుని నాలుగు ప్రైవేట్లు చెప్పకునే మాలాంటి మెథడంటే ఏవిటో తెలియనివాళ్ళొకపక్క, అసలీ బళ్లెందుకున్నాయో అర్థంకాని లాభ నష్టాలు బేరీజువేసే మేనేజిమెంట్లు ఒక




వంకా, మంచి నింప్లిమెంటు చెయ్యటానికిన్ని గోతులున్నాయని తెలిసికూడా పోస్టర్లమీద వత్తిడితెచ్చే డిపార్టుమెంటు మరో పక్కా, తమ పిల్లలు పరీక్ష పాసవడంగురించి ఆలోచించినంతగా వాళ్ళ చదువుసాములగురించి అయిదు నిమిషాలుకూడా ఆలోచించడాని కిష్టపడని పేరెంట్లు ఇంకోపక్కా ఉపాధ్యాయుల జీవితాన్ని కుక్కలు చించిన విస్తరిని చేసేసేరు. అంటే తనే ... ఏ భావిభారత పౌరుడే. నక్సలైటవ్వనీ, ఏ విద్యానిలయం ఎలా విలయతాండవాలు చెయ్యనీ అని నిరాశ చెందిపోయి ఏ ఎండ కాగొడుగు పట్టడం నేర్చుకున్నాడు ఉపాధ్యాయుడు."

"అబ్బో...ఉపన్యాసం బాగుంది... వన్స్‌మోర్...," అంటూ కేకేస్తున్న రమణాబియ్యేగాడి గొంతు విన్పించేసరికి ఆవేశం కరిగిపోయింది. ఇంట్లో పరిస్థితి చప్పున గుర్తుకొచ్చింది. "నాన్నా, ప్రసాదూ...కాస్త మంచీళ్ళు పట్రాబాబూ ..." అంటూ ఇంట్లోకి తొంగిచూసి, నాగేశ్వర్రావు కొడుక్కో కేక పెట్టేడు రమణయ్య.

మంచినీళ్ళు తాగి గ్లాసు కిందపెడ్తూ, "ఆ గుర్నాధం కొడుకు కాన్వెంటులో వెలిగిస్తున్నాడు కదా...అదో వెలంవెర్రి ...డబ్బును బట్టి చదువులు...అక్కడంతా డబ్బుతోపని. ఇతగాడు చూస్తే బెల్లపువినాయకుడికి ముడ్డిగిల్లి నైవేద్యం పెట్టేరకం." అన్నాడు, నాగేశ్వర్రావు కదలికలు కనిపెడ్తూ.

"హహ్హ" అని బులుపుతీరగా గట్టిగా

నవ్వి "ఏవంటాడేవిటి?'' అనడిగేడు నాగేశ్వర్రావు కుతూహలంగా.

''ఆయన తరహావేరు. ఎందుకూ ఉన్నాయి లక్షలు. స్టేట్ బేంకీలోనూ ఉన్నాయి కట్టలు. మనకేవిటుపయోగం? ఈవి ఉండాలండీ. దానికి మీతో సరి తూగుతాడటండీ. ముఖస్తుతి అనికాదుగాని ఎప్పుడు నాకు తక్కువ చేసేరు మీరు? ఆ ప్రైవేటు జీతానికి ఓసారివెళ్తే మావిడ దగ్గర తాళాలుండిపోయే యంటాడు. మరోసారివెళ్తే చిల్లరలేదంటాడు. రెండూ వుంటే సుక్కురారం ఇవ్వరాదంటాడు. అదేం మనిషండీ, మహాప్రభో."

"బాగా చెప్పేవు. గుర్నాధం సంగతి నువ్వే చెప్పాలి రవణయ్యా..."అని మళ్ళీ గట్టిగా నవ్వి, ''ఒరే ప్రసాదూ... అమ్మనడిగి ఓ పదిరూపాయలట్రా..." అని కేకేసాడు నాగేశ్వర్రావు.

పుచ్చుకుని "మరి నేవెళ్ళొస్తాబాబూ ...ప్రసాదంబాబూ రేపు మళ్ళినాళొస్తాను ప్రెయివేటుకి...ఆఁ" అంటూ గొడుగు తీసేడు రవణయ్య.

ఎక్కడా మబ్బుతునకకూడా కన్పించనీకుండా ప్లేటుఫిరాయించేసింది ఆకాశం. మేస్టారిచేత కందుజెల్లతిన్న విద్యార్థిలా ముఖం ఎర్రగాచేసుకొని చూస్తున్నాడు సూర్యుడు. ఎదురుదెబ్బలతో లోకజ్ఞానంతో వికసించిన రవణయ్యమేస్టారి తెలివితేటల్లా ఆయన గొడుగు విచ్చుకుంది.

---

"సరళ విమానంలో తప్ప పెళ్లి చేసుకోనని పట్టుబడుతున్నది. కారణమేమిటి ?

"నీకు తెలియదా? భూమి మీదఉన్న ఏ మగవాణ్నీ పెళ్లి చేసుకోనని ఆమె ప్రతిజ్ఞపూనింది."